www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 17 ఫిబ్రవరి 2025



నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 17వ తేదీన సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంటకల్లా తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదికలో నియోజకవర్గ, మండలస్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

నేడు అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద జరిగే

ధర్నాలను జయప్రదం చేయండి

ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు చేసిన సుదీర్ఘ పోరాటానికి నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా, అధ్యక్షురాలు లలిత డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత వైసిపి ప్రభుత్వం, జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంలో అంగన్వాడీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, అమలు చేయకపోవడంతో 42 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చారిత్రాత్మకమైన పోరాటం చేపట్టారని, సుదీర్ఘ పోరాటం సందర్భంలో జులైలో వేతనాలు పెంచుతామని, అలాగే మరో 11 రకాల డిమాండ్లను పరిష్కరిస్తామని మినిట్స్ కాపీ ఆధారంగా హామీ ఇచ్చారని తెలిపారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మినిట్స్ కాపీ హామీలు అమలు చేయాలని కోరుతూ అనేక దఫాలుగా మంత్రుల నుండి ముఖ్యమంత్రి వరకు విన్నవించుకున్నామని, కాని నేటికీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ 2019 నుంచి నేటి వరకు అంగన్వాడీ కార్మికుల జీతాలు పెరగలేదని కానీ ప్రభుత్వ అనేక రకాలుగా యాప్ల పేర్లతో, నూతన విధానాలతో పని భారాలు పెంచుతుందే తప్ప వారి ఆర్థిక కష్టాలు మాత్రం గుర్తించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అన్నారు. సుప్రీంకోర్టు అంగన్వాడీలు గ్రాట్యుటీలకు అర్హులేనని 2022లోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఆ తీర్పు అనుగుణంగా చంద్రబాబు ప్రభుత్వం మేనిఫెస్టోలో అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకు పూర్తిగా విస్మరించారని వాపోయారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాలలో దాదాపుగా 5600 మినీ సెంటర్లు ఉన్నాయని ఈ సెంటర్లలో మినీ వర్కర్లకు తక్కువ వేతనంతో ఎక్కువ పనిభారాలు జరుగుతున్నాయని, వీటన్నింటి పరిష్కారం కొరకు మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ప్రభుత్వ సర్వేలు నివేదికలు అందిస్తున్న ప్రభుత్వం మాత్రం జీవోను విడుదల చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్న ప్రభుత్వం రూ.7వేలు వేతనం వస్తున్న అంగన్వాడీలకు ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అందివ్వాలని అనేక సర్క్యులర్స్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం వారిని మోసం చేస్తుందన్నారు. అలాగే అంగన్వాడీ మరణానంతరం దహన కార్యక్రమాలకు రూ.20 వేలు ఇవ్వాలని మినిట్స్ కాపీలో ఉన్నప్పటికీ, దానిని ఏదో గొప్పగా అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం చెప్పుకుంటూ కేవలం రూ.15 వేలు మాత్రమే అందివ్వడం దుర్మార్గమన్నారు. పేదలకు ఇచ్చే పరిహారంలో కూడా ఐదు వేల రూపాయలు తగ్గించివ్వడమంటే ప్రభుత్వం ఏ స్థాయిలో దిగజారుతుందో అర్థమవుతుందని అన్నారు. కావున పెండింగ్లో ఉన్న సెంటర్ బిల్లులు, టిఏ బిల్లులు, కావెంట్, ఈవెంట్ బిల్లులు రెండు సంవత్సరాల నుంచి లేకుండా నిలిచిపోయాయని వెంటనే విడుదల చేయాలని, అదే విధంగా రానున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీ సమస్యలపై చర్చించాలని, అంగన్వాడీ జీతాలు పెంచాలి, మినీలకు జీవోలు విడుదల చేయాలి, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని, సంక్షేమ పథకాలు, గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రాజెక్టులో ఉన్న సమస్యలను కూడా పరిష్కారానికి జిల్లా అధికారులు కృషి చేయాలని కోరారు.

మినిమం టైం స్కేల్ సాధనకు ఉద్యమిద్దాం

- ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం: జేఏసీ



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - క్యాంపస్: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రభుత్వ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు అందరికీ మినిమం టైం స్కేల్ ఇస్తానని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో నెంబర్ రెండు పేరుతో ఆర్థిక శాఖ అనుమతి ఉన్న కొంతమందికి ఉద్యోగులకు మాత్రమే వర్తింప చేసింది. దీనిని తక్షణమే సవరించి అందరి ఉద్యోగస్తులకు వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. యశోద నగర్‌లో ఉన్న వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు తిరుపతి జిల్లా జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేశ్ అధ్యక్షతవహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కాంటాక్ట్, అవుట్సోర్సింగ్ జేఏసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నంబర్ 2 ను సవరించి అందరికీ ఎంటిఎస్ అమలు చెయ్యాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి అందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల కక్షపూరితమైన వైఖరి వీడాలన్నారు. గత 15 సంవత్సరాల నుంచి వేతనం పెంపులో ఎలాంటి మార్పు లేదని, ధరలన్నీ విపరీతంగా పెరిగిపోయినా, ఉద్యోగస్తులు జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. కాంటాక్ట్ వర్కర్స్ జీవితాలలో మార్పు రావాలంటే పోరాటం ఏకైక మార్గం అని పిలుపునిచ్చారు. ఆప్కాస్ రద్దు చేయడం అంటే కాంట్రాక్టర్లకు దోచిపెట్టడమేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడున్నర లక్షలకు పైచిలుకు ఉద్యోగులకు నోట్లో మట్టి కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ సంస్థ వలన అనేక రకాల ప్రయోజనాలున్నాయని, ఆప్కాస్ రద్దయిపోతే ఉద్యోగుల భద్రతలో కరువు ఏర్పడుతుందన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు, జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్‌లు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పార్ట్ టైం, ఎన్.ఎం.ఆర్, కంటింజెంట్, డైలీ వేజెస్, గెస్ట్, సకల తాత్కాలిక ఉద్యోగులందరూ మినిమం టైమ్ స్కేల్ జీవో అమలు కోసం ఉద్యోగ భద్రత రెగ్యులరైజషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు, వెటర్నరీ ఆప్కాస్ నాయకులు గంగయ్య, బాబు, ఎస్‌వియు నాయకులు రాజేంద్ర, గణేష్, మురగయ్య, సుమతి, అగ్రికల్చర్ వర్కర్స్ నాయకులు వరలక్ష్మి, మునిలక్ష్మి, సుబ్బరత్నమ్మ, చంద్రమ్మ, అనురాధ, నేషనల్ హెల్త్ మిషన్ నాయకులు ఈ. లోకేష్ బాబు, ఎస్. మొహిద్దీన్, జి నారాయణమ్మ, సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం నాయకులు మునికృష్ణ, ప్రదీప్ కుమార్, మహదేవయ్య, 104 ఉద్యోగ సంఘం నాయకులు అమర్నాథ్, బత్తిరెడ్డి, భువనేశ్వరి, 108 ఉద్యోగ సంఘ నాయకులు మహేష్, రుయా ఆప్కాస్ నాయకులు నర్సింహులు, నిర్మల ఉష, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్ నాయకురాలు రేఖ పాల్గొన్నారు.

లైంగిక నిరోధక వేధింపుల కమిటీలను అమలు చేయాలి

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పని చేసే ప్రదేశాలలో లైంగిక వేధింపులు నిరోధక కమిటీ ఉండాలని చెప్పినప్పటికీ ఏ ఒక్క సంస్థ అమలు చేయడం లేదు. పని ప్రదేశాలలో ఇప్పటికీ అనేకచోట్ల లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. జీతం పెంచమని అడిగితే పని మానేమని చెప్పడం దుర్మార్గం. ఈ కొత్త పద్ధతిని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందనే మా ఆవేదన. - శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి

మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలి

మాట్లాడుతూ జీవో నంబర్ 2ను సవరించి, తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీలు, కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ అమలు చేయాలి. సమాన వేతనం కల్పించడం ద్వారా ఉద్యోగుల జీవితాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నాం. - సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

విలేకరిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పార్వతీపురం మన్యం, మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు దాడి చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా నాయకత్వం, సిపిఎం, సిపిఐ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. దాడికి పాల్పడిన తెలుగుదేశం నాయకుడుపై కేసు నమోదు చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

మృతుల కుటుంబాలను పరామర్శించి ఎమ్మెల్యే





రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రదీప్, ఉమేష్

ప్రజాశక్తి- పలమనేరు : పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం నాలుగు రోడ్ల సమీపం సరమట్ల పల్లె గ్రామం వద్ద జరిగిన రోడ్డులో పెద్దపంజాణి మండలం శివాడి గ్రామానికి చెందిన ప్రదీప్(30) గంగవరం మండలం నాలుగు రోడ్ల నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఉమేష్ గురుంగ్ (30) తన బావమరిది అరుణ్ గురుంగ్‌తో కలిసి పుంగనూరు నుంచి ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తూ సరమట్లపల్లి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ప్రదీప్, ఉమేష్ గురుంగ్‌లు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అరుణ్ గురుంగ్ తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరి సైతం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి ఆసుపత్రి వద్దకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చికిత్స పొందుతున్న ఇద్దరికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

జర్మనీలో మృతి చెందిన

ఇళ్ళత్తూరు వాసికి దహనక్రియలు

ప్రజాశక్తి- విజయపురం: జర్మనీ దేశంలో మృతి చెందిన చిత్తూరు జిల్లా విజయపురం మండలం ఇళ్ళత్తూరు వాసి సుబ్రహ్మణ్యం కుమార్తె భార్గవి(35)కు ఆదివారం తమిళనాడులోని చెంగల్‌పట్టులో దహనక్రియలు నిర్వహించారు. మండలంలోని ఇళ్ళత్తూరుకి చెందిన సుబ్రహ్మణ్యం బ్యాంకు ఉద్యోగి. ఆయన కుమార్తె మృతురాలు భార్గవి సాఫ్ట్వేర్ ఇంజనీరుగా జర్మనీలో స్థిరపడ్డారు. జర్మనీలో స్థిరపడ్డ తమిళనాడు రాష్ట్రం చెంగల్ పట్టుకు చెందిన శాస్త్రవేత్తతో 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కుటుంబం సజావుగా జరుగుతున్న సమయంలో వారంరోజుల క్రితం భార్గవి జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లింది. పరీక్షలు నిర్వహించిన అనంతరం మెదడులో సమస్య ఉందని వైద్యులు ధృవీకరించారు. ఆమె అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఈనెల 14వ తేదీ శుక్రవారం మృతి చెందడంతో 15న రాత్రి 10 గంటలకు చెన్నై విమానాశ్రయానికి తీసుకొచ్చారు. ఆదివారం చెంగల్‌పట్టులో దహనక్రియలు నిర్వహించారు. ఆమె మృతదేహానికి సినీ దర్శకుడు, మాజీ మంత్రి భర్త ఆర్కే సెల్వమణి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ దీప్తి గోపిరాజు, ఎంపీటీసీ సరళ వెంకటేసులు, గోపి, రమేష్, శ్రీహరి, బాబురాజు, నాగేంద్ర సంతాపం వ్యక్తం చేశారు.



భార్గవి మృతికి నివాళులు అర్పిస్తున్న ఆర్కే సెల్వమణి

నారా లోకేష్‌ని కలిసిన పూతలపట్టు ఎమ్మెల్యే

నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ

ప్రజాశక్తి- యాదమరి: నెల్లూరు జిల్లా పర్యటన భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం వద్ద నారా లోకేష్‌ను ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పూతలపట్టు నియోజకవర్గంలోని రోడ్డు విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యావైద్య రంగాలలో చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలను వివరించారు. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నిధుల కేటాయింపు, యువతకు ఉపాధి అవకాశాలు, డిజిటల్ సదుపాయాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన నారా లోకేష్ ఎమ్మెల్యే వినతులను విని రాష్ట్ర ప్రభుత్వ మౌలిక అభివృద్ధి ప్రణాళికలో పూతలపట్టు నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలియజేశారు.



నారా లోకేష్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే మురళీ మోహన్

విజయలక్ష్మికి జాతీయస్థాయి అవార్డు

ప్రజాశక్తి- చౌడేపల్లి: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ వారు చౌడేపల్లి మండలం పందిళ్ళపల్లి పంచాయతీ బాలసముద్రంకు చెందిన విజయలక్ష్మికి అవార్డు ప్రదానం చేశారు. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు గల వారిలో ఆహార సమతుల్యత దెబ్బతి అనారోగ్యం పాల్పకుండా వారు తయారు చేసిన ఓజా అమృత్‌కు అవార్డు పంట పండింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత జీవనవిధానంలో మనం తీసుకునే ఆహారంలో సమతుల్య లోపించడం వల్ల వయస్సుతో సంబంధం లేకుండా అనేక రకాలైన అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని తెలిపారు. ఎన్నో బహుళజాతీయ సంస్థలు శరీరానికి కావాల్సిన ఆహారాన్ని అందించడానికి చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన ఫలితాలు ఇవ్వటం లేదని, ఈ సమతుల్య ఆహార లోపానికి మూల కారణం మన పూర్వీకులు మనకు అందించిన చిరుదాన్యలను పక్కనపెట్టి ఆకర్షణీయమైన ఆహారపు అలవాట్లకు అలవాటు పడటమన్నారు. చిరుదాన్యాలను రోజు ఆహారంగా తీసుకోవటం వల్ల బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు శరీరానికి కావలిసిన క్యాలిష్యం, మెగ్నీషియం, జింక్, ఐరన్ వంటి మరెన్నో పోషకాలు విరివిగా లభించి మన మానసిక, శారీరక ఆరోగ్యన్ని, రోగనిరోధక శక్తిని పెంచడానికి ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. అంతేకాకుండా శరీరానికి ఎంతో ఉపకరించే అన్ని పోషకవిలువలు కలిగిన చిరుదాన్యలు, డ్రైఫ్రూయిట్స్, తాటిబెల్లం ఒకే మిశ్రమంగా కలిగిన ఓజా అమృత్‌ను అందిస్తున్నామని తెలిపారు. ఈ అవార్డు ప్రదానం చేసిన విశ్వగురు స్వామి వివేకానంద ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.



వీఆర్ఓల నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి- యాదమరి: చిత్తూరు జిల్లా వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గాన్ని తిరుపతి జిల్లా అధ్యక్షులు చంగల్ రాయులు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు బాలాజీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మనాభం ఆధ్వర్యంలో చిత్తూరు రెవెన్యూ భవన్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చిత్తూరు జిల్లా వీఆర్వోల సంఘం నూతన అధ్యక్షులుగా జి.రాజశేఖర్ వీఆర్వో (తవణంపల్లి), ఉపాధ్యక్షులుగా ఏ.వెంకటముని, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శరత్ కుమార్ (చిత్తూరు రూరల్), జిల్లా కోశాధికారి కే.దామోదరం (తవణంపల్లి), జాయింట్ సెక్రటరీ ఉమామహేశ్వరి (చిత్తూరు అర్బన్), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సుబ్బయ్య, దేవకుమార్, జాయింట్ సెక్రెటరీ తేజ్ శ్రీనివాస్, ఈసీ మెంబర్ అజయ్ కుమార్, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా బాలాజీ రెడ్డి, చిత్తూరు డివిజన్ అధ్యక్షులు రమేష్, పలమనేరు డివిజన్ అధ్యక్షులు హనుమంతరావు, మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ చిత్తూరు జిల్లా ఛైర్మన్ పిబి.బాలసుబ్రమణ్యం, గౌరవాధ్యక్షులు గంజి రామమూర్తి, కోశాధికారి రెడ్డి గోపాల్ కోరారు. చిత్తూరు జిల్లా రెవిన్యూ భవన్‌లో ఆదివారం వారు పలు శాఖలో పనిచేసే ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీస్ అయినప్పటికీ రాష్ట్రంలో మెప్మా, సెర్ప్‌లలో పనిచేసే ఉద్యోగులకు అప్పటి ప్రభుత్వం హెచ్ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించిందని, ప్రస్తుతం అందరూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కీలక ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నారని వీరికి ఉద్యోగ భద్రత లేని కారణంగా అనేక ఇక్కట్లు పడుతున్నారని అందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రతతో పాటు, భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల మంత్రివర్గం సమావేశంలో ఆప్కాస రద్దుపై వస్తున్న ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలుపుతూ ప్రభుత్వం మరల ప్రైవేటు ఏజెన్సీల దోపిడీకి గురి అయ్యేటట్లుగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులను బయటకు నెట్టవద్దని, మెరుగైన విధానాన్ని తీసుకుని వచ్చి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే ఆప్కాస్ రద్దుపై వస్తున్న ప్రకటనలను ప్రభుత్వం ఖండిస్తూ పత్రిక ప్రకటన విడుదల చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు

నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం..


ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



బ్యాట్మెంటన్ టోర్నమెంట్ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. మెసానికల్ గ్రౌండ్స్‌లోని బ్యాడ్మింటన్ కోర్టును అధునాతనంగా తీర్చిదిద్దారు. ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీద ప్రారంభించారు. అనంతరం కాసేపు యువతతో ఎమ్మెల్యే బ్యాడ్మింటన్ ఆడారు. యువతకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరులో యువతకు, క్రీడాకారులకు కావలసిన అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి, కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువత చదువుతోపాటు ఆరోగ్యంగా ఉండడానికి క్రీడల పట్ల మక్కువ చూపాలని సూచించారు. నాయకులు దొరబాబు, చంద్ర ప్రకాష్, గురజాల జీవన్, సురేష్, కోచ్ బాలాజీ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్


ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి పంచాయతీకి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డికి కొన్నాళ్ళ క్రితం రోడ్డు ప్రమాదంలో ఆయన కాలుకి తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేశారు. దీంతో బాధిత సుబ్రమణ్యంరెడ్డికి ఆదివారం రూ.3.05లక్షల చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ విఎం.థామస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ యుగంధర్, హరీష్ యాదవ్, బుజ్జి, యువరాజ్, జమీర్ పాల్గొన్నారు.

ఆలోచించండి.. ఆచరణలో పెట్టండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : నేటి మేధావి యువత తమ ఆలోచనలకు పదును పెట్టి వాటిని ఆచరణలో పెడితే సమాజానికి దోహదపడే ఎన్నెన్నో కొత్త కొత్త ఆవిష్కరణలు పురుడు పోసుకుంటాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ సూచించారు. పట్టుదలకు తోడు మానసిక పరిపక్వత సాధిస్తే ప్రపంచం గర్వించే మైలురాళ్లను అధిగమిస్తారన్నారు. స్థానిక తిరుపతి ఐఐటీలో టెడ్-ఎక్స్ ఈవెంట్‌ను ఆదివారం నిర్వహించారు. ఉన్నత శిఖరాలు అధిరోహించిన పలువురు టెడ్-ఎక్స్ వేదికగా తమ అనుభవాలను ఐఐటి విద్యార్థులకు విశదీకరించి చెప్పారు. మోటారు బైకింగ్‌లో ప్రపంచ రికార్డు సాధించిన ఇరానీ మగువ మారల్ యాజర్లూ యువతకు దిశా నిర్దేశం చేశారు. ఫిజిషియన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ధ్రువ్ చౌహాన్, ఈఎస్డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు పీయూష్ సోమాని తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌సి విధానం మార్చాలి

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: స్కూల్ అసిస్టెంట్లకు వృత్యంతర శిక్షణలో భాగంగా నిర్వహిస్తున్న సిఆర్సిలను మునుపటిలాగే కొన్ని మండలాలను కలిపి సీఆర్సీ నిర్వహించాలని టిఎన్‌టియుసి రాష్ట్ర అసోసియేట్ ప్రసిడెంట్ యుగంధరాచారి కోరారు. ఆదివారం ఆయన మీడియాకి ప్రెస్ నోట్ విడుదల చేశారు. ప్రస్తుత విధానంలో సబ్జెక్టుకు నాలుగు లేక ఐదు గురు టీచర్లు మాత్రమే ఉన్నారు. ఇది అంత ప్రయోజనకరంగా లేదన్నారు. మునుపటి విధానంలో 30 నుండి 40 మంది టీచర్లు ఉన్నారని ఆ శిక్షణ సజావుగా సాగిందన్నారు. ప్రస్తుత విధానంలో ప్రాథమిక టీచర్లు 30 మందికి పైగా ఉన్నారని సమస్య లేదన్నారు. ప్రభుత్వం ఈ విషయమై పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.


గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని గంగమ్మ జాతర సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అరమనాథరెడ్డి గంగమ్మను దర్శించుకున్నారు. ఈ జాతరకు చిత్తూరు జిల్లాలోనే ఒక ప్రత్యేకత వుంది. గ్రామస్థులు ఒక మిత్ర బృందంగా పాల్గొని అమ్మవారి కార్యక్రమంలో భాగ స్వాములు అయ్యారు. కురవీధిలో అమ్మవారిని కొలువు తీర్చి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగిస్తూ, ప్రతి ఇంటా అమ్మవారి దర్శన భాగ్యం కల్పించడంలో బైరెడ్డి వంశస్థుల చొరవ, గ్రామస్తుల సహకారం ఎంతో వుంది. విద్యుత్ దీపాలంకరణ, డీజే, సన్నాయి, డ్రమ్స్, తోలు బొమ్మలాట నడుమ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎన్ అమరనాథ్ రెడ్డి బైరెడ్డిపల్లి గ్రామానికి హాజరయ్యారు. ఆయనకు మాజీ జెడ్పిటిసి రాధా కిషోర్ గౌడ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఊరేగింపుగా వస్తున్న భక్తుల నడుమ అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. తీర్థ ప్రసాదాలు అదించి ఆశీర్వ దించారు. తర్వాత అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ సమయం మార్చాలి

ప్రజాశక్తి -కార్వేటినగరం: క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు నియమించిన సమయాన్ని మార్చాలని రాష్ట్ర ఎస్టీయూ కార్యదర్శి హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల ఉపాధ్యాయులకు అనుగుణంగా మార్పులు చేయాలన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు బస్సు సౌకర్య లేని ప్రాంతాల్లోను, దీర్ఘకాలిక వ్యాధులతో పాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులకు, వికలత్వ ఉపాధ్యాయులకు ఇది సమస్యగా మారుతోందన్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులు ఉదయం 5గంటలకు బయలు దేరిన వారికి ఫోన్ ఛార్జింగ్ లేక అటెండెన్స్ ఇబ్బందులు ఎదరయ్యే అవకాశం ఉందన్నారు. పాఠశాల సమయం నాలుగు గంటలకు ముగించాల్సి ఉండగా కాంప్లెక్స్ సమావేశాల పేరుతో ఐదున్న గంటల వరకు పెంచడం దారుణమన్నారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల పేరుతో ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపునకు దిగుతోందని ఆరోపించారు. విద్యాశాఖకు సంబంధించిన ఉన్నత అధికారులు స్పందించి క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నాగులు గంటలకే ముగిసేలా చూడాల్సిన అవసరం వుందన్నారు,


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ముగిసిన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సాయి మాత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయ వంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థపాక అధ్యక్షులు జగదీష్ బాబు మాట్లాడుతూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలోని శంకర నేత్రాలయం వారిచే వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. ఈ శిబిరంలో 160 మంది పాల్గొన్నారని, వారిని పరీక్షించిన వైద్యులు అందులో 40 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించామని తెలిపారు. వారికి శంకర నేత్రాలయంలో ఉచిత చికిత్స అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివ, విజయ్, లావణ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీకె లావణ్యబాబు

పొన్నియమ్మ ఆలయ మహాకుంభాభిషేకం: లావణ్య

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : వచ్చే నెల 15 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు మూడు రోజులపాటు చిత్తూరులో నిర్వహించనున్న పొన్నియమ్మ ఆలయ మహా కుంభాభిషేకాన్ని జయప్రదం చేయాలని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు సతీమణి సీకే లావణ్యబాబు కోరారు. ఆదివారం ఉదయం స్థానిక పొన్నియమ్మ ఆలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ వివిధ కారణాలతో వచ్చే నెల 15 వ తేదీ నుంచి 3 రోజుల పాటు కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించానని తెలిపారు. అందులో భాగంగా వచ్చే నెల 2 వ తేదీ బాలాలయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేష్, హేమంత్ కుమార్, గుణశేఖర్, హేమారెడ్డి, సత్య, సుబ్బు, సిఆర్సి రవి పా ల్గొన్నారు.

డ్రమ్ సీడర్.. ఆదాయం మెండు

- రైతులకు కూలీల సమస్య పరిష్కారం
- వరి నాట్ల ఖర్చు తగ్గింపు
- మండల వ్యవసాయాధికారిణి సూచన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: రైతులు తమ పొలాల్లో డ్రమ్ సీడర్ వినియోగించడం వల్ల పైరుకు మధ్య తేడా అధికమై మొక్క ఏపుగా పెరిగి పంట దిగుబడి అధికంగా వచ్చి రైతులు మంచి లాభం పొందవచ్చని, వరి నాట్లకు అయ్యే విపరీత ఖర్చును తగ్గించ వచ్చని, రైతు ప్రస్తుతం పంట పొలాల్లో వరి నాట్లకు బదులు సీడర్ లాగే పద్ధతికి అలవాటు పడుతున్నాడు. దీంతో ఖర్చు, సమయం ఆదా అవుతుందని ఈ పద్ధతిని రైతులు అనుసరించాలని మండల వ్యవసాయాధికారిణి వనిత సూచించారు.

వెదురుకుప్పం మండలంలో 25 పంచాయతీలు వున్నాయి. గత సంవత్సరం నవంబరు, డిసెంబరు నెలలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండి నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. ఈ సారి నీటి కొరత సమస్య తలెత్తే ప్రమాదం లేదు. అందువల్ల రైతులు వరి పంటను పండించేటందుకు ఆసక్తి చూపుతూ డ్రం సీడ్ వేస్తున్నారు. మండలంలో ప్రస్తుతం 120 హెక్టార్లలో వరి పంట ప్రారంభ దశలో వుంది. ఇది ఇంకా పెరిగే అవకాశం వుంది.
వెదురుకుప్పం మండలంలో 25 పంచాయతీలు వున్నాయి. గత సంవత్సరం నవంబరు, డిసెంబరు నెలలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండి నీళు పుష్కలంగా ఉన్నాయి. ఈ సారి నీటి కొరత సమస్య తలెత్తే ప్రమాదం లేదు.


డ్రం సీడ్ తో ఏపుగా పెరిగిన వరి పంట

అందువల్ల రైతులు వరి పంటను పండించేటందుకు ఆసక్తి చూపుతూ డ్రం సీడ్ వేస్తున్నారు. మండలంలో ప్రస్తుతం 120 హెక్టార్లలో వరి పంట ప్రారంభ దశలో వుంది. ఇది ఇంకా పెరిగే అవకాశం వుంది.

ఖర్చు తగ్గింపు

ఉదాహరణకు: 50 కిలోల వరి విత్తనాలు ముందు నారుమడికి కావాలి. పెరిగిన తరువాత, ఒక రైతు ఒక ఎకరా పొలం దుక్కి దున్ని చదును చేసి వరి పంటను నాటేందుకు, నారు పెరికేందుకు 11 మంది మగ కూలీలు అవసరం అవుతుంది. తరువాత పెరిగిన నారును పంట పొలంపై వేసేటందుకు ఐదుగురు కూలీలు అవసరం. తర్వాత నాటేందుకు 35 మంది మహిళా కూలీలు అవసరం. ప్రస్తుత ధరల ప్రకారం రైతు చెల్లిస్తున్న కూలి మగ వారికి రోజుకు రూ.500, తెల్లవారి టిఫిన్, మధ్యాహ్నం భోజనం పెట్టాలి.. మహిళలకు అయితే రోజుకి రూ.300.. రైతు మధ్యాహ్నం భోజనం పెట్టాలి. అన్నీ కలుపుకుంటే రైతుకు ఒక ఎకరా పాత పద్ధతిలో నాటేందుకు సుమారు రూ.20 వేలు పై మాటే అవుతుంది. అదే డ్రం సీడ్ పద్ధతి అయితే 30 కేజీల వరి విత్తనాలు, డ్రం లాగే మనిషి ఒక్కరు సరిపోతారు. లెక్క చూసుకుంటే రైతుకు ఎంత ఖర్చు అవుతుందో అర్థం చేసుకోవచ్చు..

పంట దిగుబడి అధికం



డ్రం సీడ్ వేసుకోవడం వల్ల వరి పైరుకు సుమారు అర అడుగు తేడా ఉంటుంది. దీంతో పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందు తుంది. చీడ పురుగుల బెడద కొంత వరకు తగ్గుతుంది. వరి పంట బాగా పెరిగి. రైతుకు మంచి ఆదాయం వస్తుంది.
- వనిత, వ్యవసాయ అధికారి, వెదురుకుప్పం.

మిట్ట నేలలో డ్రం సీడర్ బాగా వస్తుంది..



అదే పల్లపు ప్రాంతాల్లో అయితే సరిగా రాదు. నీటి నిల్వలు ఎక్కువగా ఉంటాయి. అడుసులో అక్కడక్కడ గుంతలు ఉంటాయి. అందువల్ల మొలక కుళుతుంది. మిట్ట నేలలో బాగా వస్తుంది.
చంగల్ పండు, చిన్నమ్మ రెడ్డి కండ్రిగ, వెదురుకుప్పం మండలం.

డ్రమ్స్ సీడర్ ఒకటే వాడుతున్నా..ఇబ్బంది లేదు..



గత మూడు సంవత్సరాలుగా డ్రం సీడర్ పద్ధతిలోనే వరి పంటను పండి స్తున్నా.. పంటకు రోగా ల బాధ లేదు.. వరి నాట్లతో పోలిస్తే పంట దిగుబడి బాగానే వుంది. ఇబ్బంది ఏమీ లేదు.
- కనుకొండారెడ్డి, రైతు, మాంబేడు, వెదురుకుప్పం మండలం.


పోటీల్లో పాల్గొన్న యువకులు

ఘనంగా పశువుల పండుగ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బైరెడ్డిపల్లిలో ఆదివారం భారీ జల్లికట్టు పశువుల పండగ నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు ఈ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ,2,01,116లు, ద్వితీయ బహుమతి 1,01,116లతో పాటూ వివిధ బహుమతులు అందించారు. ఈ పండుగలో రామ కుప్పం మండలానికి చెందిన శంకరప్ప ఎద్దు మొదటి ప్రైస్ సాధించింది. తమిళనాడుకు చెందిన ఆర్ఆర్ వాసు ఎద్దు రెండో ప్రైజు గెలుచుకుంది. వీరికి గ్రామస్తులైన బైరెడ్డి కుటుంబీకులు గెలుపొందిన ఎద్దుల యజమానులకు ఘన సత్కారం నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మండల వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

19న మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపిడివో వేణు

ప్రజాశక్తి - యాదమరి: ఈ నెల 19వ తేదీ మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి వేణు తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ సర్పంచులు, అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని తెలిపారు. సమావేశానికి వచ్చే మండల స్థాయి అధికారులు వారి శాఖల సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాలు పూర్తి స్థాయిలో తీసుకురావాలని తెలిపారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముస్లిం సోదరులు

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరుకు చెందిన పలువురు మైనారిటీ పెద్దలు, మసీద్ ఇమాము లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఆదివారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. పలమనేరు పట్టణ , మండల ఖాజీగా ముఫ్తి షేక్ అబ్దుల్లాను నియమించినందుకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన కలిసి ధన్యవాదాలు తెలిపారు. మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు అన్ని అంశాల్లో అండగా నిలుస్తామని ఈ సందర్భంగా వారు ఆయనకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మజీద్ ఇమామ్ లు జుబేర్ అహ్మద్, సయ్యద్ అహ్మద్, అబ్దుల్ రహీంలతో పాటు జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజా పీర్, డాక్టర్ ఖలీల్, జుబేర్ షరీఫ్, జావీద్, ఫైజుల్లా, షఖీల్, అశ్రఫ్ ఉన్నారు.

నేడు ముఖ్యమంత్రి తిరుపతికి రాక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సీఎం చంద్రబాబు టెంపుల్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ 2025 కార్యక్రమంలో పాల్గొన నున్న నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని జెసి శుభం బన్సల్, ఎస్పి హర్ష వర్ధన్ రాజు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, ఏఎస్పీలు శ్రీని వాస రావు, రవి మనోహరాచారి, ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, డిఎంహెచ్ఓ బాలాజీ నాయక్, రుయా సూపరింటెండెంట్ రవి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కంకర తేలిన రోడ్డు..కనికరం లేదా?

- ఆగిన బస్ సర్వీసు
- అధికారులు స్పందించరా?
- వాహన చోదకుల ఆవేదన

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు : మండలంలోని మహదేవమంగళం చెరువు కట్ట తారు రోడు పూర్తిగా కంకర తేలి గుంతలమయమైంది. ఈ కారణంగా గ్రామానికి వచ్చే ఆర్‌టిసి బస్సు సర్వీసు సైతం ఆగిపోయింది. రహదారి అస్తవ్యస్తం కావడంతో ఇటు వాహన చోదకుల రాకపోకలు సాగించడానికి ఇబ్బంది కరంగా మారింది. అయినా సంబంధిత శాఖాధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. కనీసం తమపై అధికారులకు కనికరం కూడా లేదా? అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలం లోని మహదేవమంగళం చెరువు కట్ట తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమై కంకర రాళ్ళు తేలిపోయాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణాలు సాగిస్తున్న వాహన చోదకులు ఎదుర్కొంటున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మండలంలో చిన్న వేపంజేరి, మహదేవ మంగళం, తిరువీధి కుప్పం, కడపగుంట, పంచాయతీలకు చెందిన ప్రజలు పలు రకాల ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే ప్రధానంగా మహదేవమంగళం చెరువు కట్టపై వెళ్లాల్సిందే.. ఈ చెరువు


కంకర తేలి ఇబ్బందికరంగా మారిన రహదారి

కట్టపై ఉన్న తారు రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడి కంకర తేలిపోయింది. చిత్తూరు -తిరువీధికుప్పం ఆర్టీసీ బస్సు సైతం ఈ రహదారిలోనే రాకపోకలు సాగిస్తుండేది. ప్రస్తుతం ఆ బస్సు సైతం నిలిచిపోయింది. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన తారు రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

దేవాలయాన్ని వదలని రియల్ వ్యాపారులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండలం చిన్నబంగారునత్తంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు దేవాలయాలను సైతం వదిలిపెట్టడం లేదని, తమ గ్రామంలోని కుంటి గంగమ్మ ఆలయాన్ని అధికారులే రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 122లో 7 ఎకరాల భూమి మదన్ శేఖర్ పేరుతో ఉండేదన్నారు. ఈ ఆస్తిని సుమారు 20 సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన వ్యక్తికి విక్రాయించినట్లు తెలిపారు. ఈ వ్యక్తి ప్రస్తుతం బెంగళూరు నగరంలో స్థిరపడ్డట్టు తెలిపారు. ఈ భూమి మధ్యలో కుంటి గంగమ్మ ఆలయం ఉందని, ఈ ఆలయానికి సంబంధించి ప్రతి సంవత్సరం గ్రామస్తులు జాతర నిర్వహించడం, ఆలయంలో పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ కారణంగా మదన్ శేఖర్ భూమి విక్రయించిన సమయంలోనే 30 సెంట్లు దేవాలయానికి విడిచి పెట్టాలని కోరారని తెలిపారు. భూమి కొన్న వ్యక్తి సానుకూలంగా స్పందిస్తూ ఆలయానికి స్థలాన్ని విడిచిపెట్టడంతో పాటు తన సొంత ఖర్చుతో రోడ్డు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం భూముల రేట్లు అమాంతం పెరిగిపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూమిపై కన్నేశారని, సైట్లు చేసి అమ్ముకుని సొమ్ము చేసుకోవడానికి పథకం పని, ప్రస్తుత భూ యజమాని నుండి సదరు భూమిని కొనుగోలు


దేవాలయాన్ని రక్షించాలని కోరుతున్న గ్రామస్తులు

చేసినట్టు చెప్పారు. ఆ భూమిలో ఉన్న పురాతన ఆలయాన్ని కూలదోయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసి గ్రామస్తులు అడ్డుకోగా భూమి మధ్యలో ఉన్న దేవాలయాన్ని కూలదోసి ఒక పక్కకు మరో నూతన దేవాలయాన్ని నిర్మించుకోండి, ఈ ఆలయం భూమి మధ్యలో ఉండటం వల్ల సైట్లు అమ్ముకోవడానికి ఇబ్బంది కలుగుతుంది అంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు గ్రామస్తులతో వాగ్వాదానికి దిగినట్టు గ్రామస్తులు తెలిపారు. అంతేకాక రాత్రికి రాత్రే అమ్మవారి ఆలయాన్ని కూలదోస్తారన్న అనుమానాన్ని సైతం గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామ పరిధిలోని కుంటి గంగమ్మ దేవాలయాన్ని రక్షించాలని వారు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ అన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలనకై నియోజకవర్గానికి రెండు పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి హామీ కల్పించడమే ధ్యేయంగా నిర్వహిస్తానన్నారు. ఇది ప్రజల ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కోరే ప్రభుత్వం ప్రజలకు ఏ అవసరము వచ్చిన వాట్సాప్ లో సమస్య తెలిపిన వెంటనే పరిష్క రిస్తారని తెలిపారు. ఎస్ఆర్ పురం మండలం పుల్లూరులో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రభుత్వ విప్, జనసేన ఆధ్వర్యంలో డాక్టర్ థామస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం పుల్లూరు సర్పంచ్ భవ్య పవన్ , మండల అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించారు.


నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి
- జిల్లా ప్రియాంక సేవాదళ్

ప్రజాశక్తి -పుంగనూరు: రైల్వే స్టేషన్లో తొక్కి సలాటకు బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్ సజాద్ బాష ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రయాగలో పుణ్య స్థానాల కోసం ఢిల్లీ నుండి ప్రయాణమైన సామాన్యులు భక్తులు మరణించడం అత్యంత బాధాకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం భక్తులకు అదనపు రైళ్లను, బోగీలను ఏర్పాట్లు చేసి భక్తుల కోసం మరో నెల రోజుల పాటు కుంభమేళాని పొడిగించేలా అవకాశం కల్పిస్తూ అన్నీ సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని, నిర్లక్ష్యం చేయొద్దని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ తరపున డిమాండ్ చేస్తోందన్నారు.

నేడు వాటర్ షెడ్ యాత్ర

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం వాటర్ షెడ్ యాత్ర నిర్వహిస్తున్నట్లు పిఓ శోభారాణి తెలిపారు. వాటర్‌షెడ్ యాత్ర లో నీటి పొదుపు, వర్షపు నీరు వృధా కాకుండా ఏ విధంగా ఒడిసి పట్టడం, నీటి విశిష్టత గురించి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించడం, నీటి వినియోగం పొదుపు గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం, మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సభ్యులకు వివరించడం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శిస్తామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.



వాటర్ షెడ్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొంపిచర్ల : పులిచెర్ల మండలం కల్లూరు గ్రామ పంచాయతీలో వాటర్ షెడ్ పథకాల గురించి ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా వాటర్ షెడ్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లికార్జున్ విచ్చేసి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. వాటర్ షెడ్ లోని వివిధ రకాల పనిముట్లు, ఇంకుడు గుంతలు, నీటి వినియోగం ద్వారా పొందే లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి శ్రీనివాసులు, పిఓ తేజస్విని, టిఓ దొర్రై రాజ్, రైతులు పాల్గొన్నారు.


బోల్తా పడిన వాహనం

వాహనం బోల్తా
తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మహేంద్ర టాటా ఏసి టైర్ పేలి అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది స్థానికుల కథల మేరకు..చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి మేదవాడ సమీపంలో బంగారుపాలెం నుంచి పల్లిపట్టు వెళ్తున్న మహేంద్ర టాటా ఏసీ సిమెంట్ బండలు తీసుకువెళ్ల టైర్ పేలి అదుపుతప్పి బోల్తా పడింది. ఆ వాహనంలో ముగ్గురు ఉన్నప్పటికీ ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం నుండి తప్పించుకుని బయటపడ్డారు. అదే సమయంలో రోడ్డుపై జనం , ఎలాంటి వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో తిరుపతికి చెందిన ప్రభుత్వ వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులను గుర్తించి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరానికి అనేక మంది రోగులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు లేక్‌గా కాజూరు చెరువు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక కాజూరు చెరువును శ్రీకృష్ణ దేవరాయుల లేక్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. చిత్తూరులోని కాజూరు చెరువులో శ్రీకృష్ణదేవరాయలు లేక్‌గా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు ఆదివారం చిత్తూరులో ఘనంగా నిర్వహించారు. కాపు సంఘం, బలిజ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం వద్దనున్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచం మెచ్చిన నాయకుడు శ్రీకృష్ణదేవ రాయలు జయంతి వేడుకలు చిత్తూరులో ఘనంగా నిర్వహిం చడం సంతోషంగా వుందన్నారు. బలిజ సంఘాల కోరిక మేరకు చిత్తూరులోని కాజూరు చెరువును శ్రీకృష్ణదేవరాయలు లేక్‌గా నామకరణం చేయడమే కాకుండా వాకింగ్ ట్రాక్, పార్కులు అభివృద్ధి చేస్తామన్నారు. విశేష సేవలందించిన నాయకుల విగ్రహా లను చెరువు చుట్టూ ఏర్పాటు చేసి ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. కాపు భవన్ నిర్మాణానికి కృషి చేస్తామని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తన విరాళంగా రూ.50 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, నాయకులు బద్రీనారాయణ, కాజూరు బాలాజీ, ఆరణి కవిత పాల్గొన్నారు.

పుంగనూరు: శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలను పుంగనూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భీమగాని



పల్లె వద్ద వున్న శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో కృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకొని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూల మాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని స్థానిక ఇందిరా సర్కిల్ (ముడెప్ప సర్కిల్)లో శ్రీకృష్ణదేవరాయల చిత్రపటాన్ని ఏర్పాటు చేసి బలిజ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నానుబల గణేష్, పూల త్యాగరాజు, తుంగ మంజునాథ్, మధుసూదన్ రాయల్, పూల మల్లికార్జున, గంగాధర్ రాయల్, కాంట్రాక్టర్ రమణ పాల్గొన్నారు.